# బెల్లంపల్లిలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

**74.85 శాతం పోలింగ్ నమోదు**

**19 వ వార్డు లో ఓటేసిన బ్యాలెట్ పేపర్‌ను సెల్ ఫోన్ స్టేటస్‌గా పెట్టుకున్న మాజీ కౌన్సిలర్**

**విధుల్లో ఉన్న పోలీసులపై విచారణ?**

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 11:**

బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డుల్లో మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. అధికారులు ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఈసారి 34 వార్డుల్లో 68 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 44554 మంది ఓటర్లు ఉండగా ఉదయం 11 గంటల వరకు 13621 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో 30.50 శాతం పోలింగ్ నమోదైంది. 21549 మంది పురుషులు, 23002 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు 22457 మంది ఓటు వేయగా పురుషులు 48.55, మహిళలు 52.14 శాతం ఓటింగ్ పాల్గొన్నారు. దీంతో 50.40 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 28,743 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 62.68 శాతం పురుషులు, 66.24 శాతం మహిళలు ఓటింగ్‌లో పాల్గొనడంతో 64.51 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం పోలింగ్ ముగిసిన సమయానికి 33350 మంది ఓటర్లు పోలింగ్ లో పాల్గొనడంతో 74.85 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ తీరును పరిశీలిస్తే ఉదయం 9 గంటల వరకు 18 వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపారు. 3,17 వార్డులకు కేటాయించిన భవిత కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఓట్ల కోసం బారులు తీరి కనిపించారు. ఈ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు కొత్త ఓటర్లు, మహిళలు ఉత్సాహం చూపారు. బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసేందుకు వృద్ధులు వీల్ చైర్లు, ఇతరుల సహాయంతో రావడం కనిపించింది. 16వ వార్డు నుండి రామటెంకి ఆశమ్మ అనే శతాధిక వృద్ధురాలు ఓటు వేసేందుకు ఆసక్తి చూపింది. 5,6,22,వ వార్డు పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం మందకోడిగా పోలింగ్ సాగింది. 7వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద బి ఆర్ ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు చెందిన అనుచరుల మధ్య స్వల్ప గొడవ జరిగింది. 8 వ వార్డు (68 డిప్),23 వ వార్డు గర్ల్స్ హైస్కూల్, 10 వ వార్డు (రైల్వే స్టేషన్ పెద్దనపల్లి) పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం కనిపించింది. 31 వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉత్కంఠ వాతావరణం లో ఓటర్లు పోలింగ్ లో పాల్గొనడం కనిపించింది. కాంగ్రెస్ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పలు వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను కలిసి పోలింగ్ సరళని పరిశీలించారు. 29వ వార్డులో బి ఆర్ ఎస్ అభ్యర్థి గులాబీ రంగు కారు గుర్తు, అభ్యర్థి ఫోటోతో కూడిన బ్యాలెట్ పేపర్ పై స్లిప్ నెంబర్లను రాసి ఇచ్చి ఓటర్లను ప్రభావితం చేశారని కాంగ్రెస్, బిజెపి, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల అధికారి సంపత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. 19 వ వార్డు లోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ తాను ఓటు వేసిన బ్యాలెట్ పేపర్‌ను తన సెల్ ఫోన్‌లో వాట్సప్ స్టేటస్ గా పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్ తీసుకొని వెళ్లడం పట్ల అక్కడ పోలీసుల భద్రతా లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు కంగు తిన్నారు. సెల్ ఫోన్‌లో బ్యాలెట్ పేపర్ వాట్సప్ స్టేటస్ చక్కర్లు కొట్టిన వ్యవహారంపై విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. సెల్ ఫోన్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడం పట్ల నిర్లక్ష్యంగా విధుల్లో ఉన్న పోలీసులపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరుగుతున్నట్టు తెలిసింది. పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. చిన్న చిన్న చెదురు మధురు సంఘటనలు మినహా మొత్తం మీద బెల్లంపల్లి లో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.






# క్యాతనపల్లిలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

**-71.87% శాతం పోలింగ్ నమోదు -**

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి11:**

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు క్యాతనపల్లిలో ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఎన్నికల్లో 72.87 శాతం పోలింగ్ నమోదయింది. మున్సిపాలిటీ లోని 22 వార్డులకు గాను,45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు వారి మద్దతు దారులు, ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, వారి వారి పార్టీ గుర్తులకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పర్స రమేష్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఓటు హక్కు వినియోగించు కునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్ సౌకర్యం కల్పించడంతో పాటు కేంద్రాల్లో



వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉండగా పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తుండగా అభ్యర్థుల భవితవ్యం పోలింగ్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉండగా ఈనెల 13 న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.





# పదోన్నతి పొందిన పిహెచ్సి వైద్యులు





**జనోదయ, మందమర్రి, ఫిబ్రవరి11:**

పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులుగా సేవలందిస్తున్న వైద్యులు రమేష్ , మానసలు పదోన్నతి పొందారు. పట్టణ, మండలం లోని వివిధ గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన వైద్యులు డాక్టర్ రమేష్ జనరల్ ఫిజిషియన్‌గా, మానస డెర్మటాలజిస్ట్‌గా పదోన్నతులు పొందారు. పదోన్నతి పొందిన వైద్యాధికారులను పిహెచ్సి వైద్య సిబ్బంది అభినందించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాట్లాడుతూ వృత్తిపరమైన ప్రయాణంలో పదోన్నతి అనే మైలురాయిని దాటడం గొప్ప విజయమన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించి రోగులకు మరింతగా సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కస్తూరి గంగాధర్, ఎఎన్ఎం లు పాల్గొన్నారు.

# చొప్పదండి ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షుడిగా బొక్కెన కృష్ణకుమార్



**జనోదయ : చొప్పదండి**

చొప్పదండి ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా బొక్కెన కృష్ణకుమార్‌ను యూనియన్ అధ్యక్షు డిగా (ప్రెసిడెంట్‌గా) ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కృష్ణకుమార్ మీడియాతో మాట్లాడారు. తనను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ సంక్షేమం, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో యూనియన్ కార్యవర్గాన్ని కూడా ఎంపిక చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా మేడి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.జలందర్, మొగిలి మహేష్, రేగుల మహేష్‌లను నియమించారు.ప్రధాన కార్యదర్శిగా మేడి శుభాష్, కోశాధికారిగా సామల విజయ్‌ను ఎన్ను కున్నారు. సంయుక్త కార్యదర్శులుగా బొగా సూర్య తేజ, లింగారెడ్డిలు బాధ్య తలు స్వీకరించారు. అలాగే ప్రధాన సలహాదారులుగా చిన్న దేవేందర్, అల్లావుద్దీన్‌లను ఎంపిక చేశా రు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతిని ధులు పాల్గొన్నారు.

# బుగ్గ లో జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే వినోద్



**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 11:**

బెల్లంపల్లి మండలంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి కోసం చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన కమిటీ సభ్యులు, ఎండోమెంట్ అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. బుగ్గ దేవస్థానం ఎంతో మహిమాన్వితమైనదని, ఇక్కడి ఉత్సవాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఉత్సాహాన్నిస్తుందని చెప్పారు. ఈసారి జరిగే జాతరకు ముందుగానే వచ్చి రాజరాజేశ్వరునికి మొక్కులు చెల్లించుకుంటానని నిర్వాహకులకు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంట దేవ స్థానం  ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు ఉన్నారు.

# పెద్దపల్లిలో పోలింగ్ ప్రశాంతం

## అత్యధిక పోలింగ్‌తో సుల్తానాబాద్ ముందంజ.. మహిళా ఓటర్ల ఆధిక్యం

**జనోదయ : పెద్దపల్లి ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.ఉదయం వేళ నుంచే పోలింగ్ కేంద్రాల ముందు కనిపించిన ఓటర్ల క్యూలు రాజకీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచాయి. వృద్ధులు, మహిళలు,యువతీ యువకులు సమాన ఉత్సాహంతో పాల్గొనడం ఎన్నికల వేడిని మరింత పెంచింది.ఈసారి నమోదైన పోలింగ్ శాతాలు పట్టణ రాజకీయ భవిష్యత్తుపై ప్రజల ఆసక్తిని స్పష్టంగా ప్రతిబింబించాయి.పెద్దపల్లి మున్సిపాలిటీలో 64.41 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 28,205 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించారు.వారిలో పురుషులు 13,500 మంది కాగా మహిళలు 14,703 మంది,ఇతరులు 2 మంది ఉన్నారు.మహిళల ఆధిక్యం పట్టణ సామాజిక స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.ప్రజాస్వామ్యపు ఓటు విలువను గుర్తించిన ఓటర్లు క్రమశిక్షణతో పోలింగ్‌లో పాల్గొన్నారు.జిల్లాలో అతిపె ద్ద పట్టణ ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్‌లో 1,24,520 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు.పురుషులు 61,640 మంది,మహిళలు 62,868 మంది,ఇతరులు 12 మంది ఓటు హక్కును వినియోగించారు.69.32 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పట్టణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే ఈ కార్పొరేషన్‌లో ఓటర్ల చురుకుదనం స్పష్టంగా కనిపించింది.అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించే కీలక ఓటింగ్‌గా ఇది నిలిచింది.సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 13,716 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు.పురుషులు 6,692 మంది,మహిళలు 7,023 మంది,ఇతరులు 1 మంది ఓటేశారు.మొత్తం పోలింగ్ శాతం 81.52గా నమోదు కావడం జిల్లాలోనే అత్యధికంగా నిలిచింది.ఇది ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబించే స్పష్టమైన సూచికగా భావిస్తున్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమశిక్షణతో ఓటర్లు వరుసలో నిలబడటం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. మంథని మున్సిపాలిటీలో మొత్తం 11,056 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు.పురుషులు 5,393 మంది, మహిళలు 5,663 మంది ఓటు వేశారు.76.76 శాతం పోలింగ్ నమోదు కావడం పట్టణ రాజకీయ చైతన్యాన్ని స్పష్టం చేసింది.ఇక్కడ కూడా మహిళా ఓటర్ల శాతం పురుషుల కంటే అధికంగా ఉండటం విశేషంగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.సున్నిత కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు సమన్వయంతో పని చేశారు.పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలను భద్రంగా స్వీకరణ కేంద్రాలకు తరలించారు.పోలింగ్ సిబ్బంది వరుసగా కేంద్రాలకు చేరుకుంటూ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేశారు. ప్రజాస్వామ్య పండుగలా సాగిన ఈ ఎన్నికలు ఇప్పుడు లెక్కింపు దశను చేరుకున్నాయి.అభ్యర్థుల భవిష్యత్తు,పట్టణాల రాజకీయ దిశను నిర్ణయించే తీర్పు కోసం ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.జిల్లాలో నమోదైన గణాంకాలు ఓటర్ల చైతన్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.మహిళల అధిక భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం ఈ ఎన్నికల ద్వారా మరింత బలపడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థికి అభినందనలు



**జనోదయ,హనుమకొండ, ఫిబ్రవరి 11:** కాకతీయ ప్రభుత్వ కళాశాల (ఆటోనమస్), హనుమకొండలో  ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్  ఉప్పల శివ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ (రిపబ్లిక్ డే) పరేడ్‌లో పాల్గొని వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివను శాలువాతో సత్కరించి, కళాశాల తరఫున అభినందనలు తెలియజేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలలో నుండి ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కిన ఏకైక విద్యార్థి శివనేనని కొనియాడారు. కళాశాల కీర్తిని ఢిల్లీ వరకు చాటిచెప్పినందుకు ఆయనను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సీతారాములు, డా. గంగిశెట్టి శ్రీనివాస్, డా. సంధ్యారాణి, డా. ధనసింగ్, ఎన్ సి సి ఆఫీసర్లు డా. రాజేందర్, డా. ప్రసూన, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. శ్రీనాథ్, పరీక్షల నియంత్రణ అధికారి డా. శివ నాగ శ్రీను, అధ్యాపకులు డా. కోమల, డా. విజయలక్ష్మి, డా. సమ్మయ్య, డా. రవీందర్, డా. జె. చిన్న, డా. వెంకన్న పాల్గొన్నారు. అనంతరం శివ మాట్లాడుతూ, ఎంతో కష్టతరమైన శిక్షణ అనం తరం రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభించడం తనకు గర్వకారణమని తెలిపారు. ఢిల్లీ పర్యటనకు ఆర్థికంగా మరియు నైతికంగా సహకరించిన కళాశాల అధ్యాపకులు డా. రవికుమార్, డా. బి. శ్రీనివాస్ రాథోడ్, డా. కవిత, డా. శ్రీదేవి, డా. రాజయ్య, డా. శివ నాగ శ్రీను, డా. సీతారాం తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 13 న కాంట మెయిన్ బజార్ రోడ్డు మూసివేత

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 11:** బెల్లంపల్లి పట్టణంలో ఈనెల 13న (శుక్రవారం) మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉండడంతో కాంట చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ వరకు  రోడ్డును మూసివేయడం జరుగుతుందని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. కొత్త బస్టాండ్ నుండి మంచి ర్యాల వైపు వెళ్లే ప్రజలు హనుమాన్ విగ్రహం మీదుగా కాల్ టెక్స్ ఫ్లై ఓవర్ గుండా వెళ్లాలన్నారు. కాంట చౌరస్తా నుండి ఆసిఫాబాద్ వెళ్లే ప్రజలు కాల్ టెక్స్  ఫ్లైఓవర్ నుండి పంచముఖి హనుమాన్ విగ్రహం మీదుగా వెళ్లాలని సూచించారు. ఉదయం 6 గంటల నుండి కౌంటింగ్ మూసే వరకు ఈ నిబంధన అమలవుతుందని తెలిపారు.